

సోమశిలకు రూ. 68.10 కోట్లు

- వెల్‌నెస్ స్పిరిచ్యువల్ రిట్రీట్ పథకం కింద కేంద్రం మంజూరు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు వెల్లడి

కొల్లాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతంగా విరా జిల్లుతున్న సోమశిల పర్యాటక ప్రాంతం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.68.10 కోట్ల నిధులు మంజూరు చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం కొల్లాపూర్‌లో మాట్లాడుతూ... సోమశిల గ్రామంలో వెల్ నెస్ స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల పథకంలో భాగంగా దాదాపు రూ.68.10 కోట్లు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని ఎల్లేని సుధాకర్‌రావు తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు గత ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన హామీ మేరకు పర్యాటక ప్రాంతం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌తో పాటు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేఖావత్‌లకు ఎల్లేని సుధాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఆర్‌ఐడీ స్వర్ణోత్సవాలు

- మూడు రోజులు కొల్లాపూర్‌లో పండుగ వాతావరణం
- సందడి చేసిన పూర్వ విద్యార్థులు, ప్రముఖులు
- ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలతో సంబురాలు
- చివరి రోజు సన్మానాలు, సత్కారాలు

5



కొల్లాపూర్ ఆర్‌ఐడి పాఠశాలను సందర్శించిన నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, చిత్రంలో మంత్రి జూపల్లి , మై హోమ్ అధినేత రామేశ్వరరావు

బుట్ట బొమ్మా.. బుట్ట బొమ్మా..

- సినిమా పాటలతో మార్మోగిన కొల్లాపూర్
- మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఆధ్వర్యంలో అలరించిన సినీ సంగీత విభావరి
- ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రముఖులు

5



స్వర్ణోత్సవాల్లో పాట పాడుతున్న మ్యూజిక్ డైరెక్టర్ తమన్

మహబూబ్‌నగర్‌లో క్రీడా సంబురం

- నేటి నుంచి రాష్ట్ర స్థాయి రగ్బీ టోర్నీ
- పాల్గొననున్న 10 జిల్లాలు, 240 మంది క్రీడాకారులు
- టోర్నీని ప్రారంభించనున్న ప్రజాప్రతినిధులు

4



సిద్ధమౌతున్న బహిరంగ సభ ప్రాంగణం

నేడు పాలమూరుకు

సీఎం రేవంత్‌రెడ్డి

లక్ష మంది రైతులతో సదస్సు

- ముఖ్యమంత్రి చెప్పే శుభవార్త కోసం ఎదురుచూపు
- భారీ బందోబస్తు

4

పర్యటన షెడ్యూల్ ఇలా..

మహబూబ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 3:30కు పాలమూరుకు వస్తారు. 3:45 నుంచి 4:15 గంటల వరకు అమిస్తాపూర్ దగ్గర ఏర్పాటు చేసిన రైతు పండగ ఎగ్జిబిషన్ పరిశీలిస్తారు. 4:30కు రైతు సభలో పాల్గొంటారు. సాయంత్రం ఆరు గంటలకు రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ వెళ్తారు.

రైతులే ప్రాధాన్యం

ఇబ్బందులున్నా రైతు పక్షపాతిగా ఉంటాం

- ఈ వానాకాలంలో రికార్డు స్థాయిలో ధాన్యం పండించిన అన్నదాత
- వడ్లు కొనడంతో పాటు వెంటనే డబ్బులు చెల్లిస్తున్నాం
- రైతు పండగ సదస్సులో రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- 'పాలమూరు-రంగారెడ్డి' పూర్తి చేస్తే తెలంగాణలో బీడు కనిపించదు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వంశీకృష్ణ, పర్ణికారెడ్డి

మహబూబ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ రంగం, రైతులే నెంబర్ వన్ ప్రాధాన్యత అని రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా గొప్పగా రైతు పండగలను నిర్వహిస్తున్నామని తెలిపారు. భూత్పూర్ మండలం అమిస్తాపూర్ వద్ద ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు పండగ సదస్సు రెండో రోజు విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, చిట్టెం పర్ణికారెడ్డి,

(మిగతా 4లో..)



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



స్టాళ్ల వద్ద పురుగుల మందు పిచికారి చేసే యంత్రం పని తీరును పరిశీలిస్తున్న రైతులు

డీఈవో బాధ్యతల స్వీకరణ

4



కలెక్టర్ సంతోష్‌కు బొకే అందిస్తున్న డీఈవో

మైనింగ్ మాఫియాను అడ్డుకుంటాం

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

4

మెరుగైన విద్యే లక్ష్యం

- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వివరాల రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఆకునూరి మురళి

వెల్దండ/మన్ననూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించమే లక్ష్యమని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలను ఆకునూరి మురళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికల ఉన్నతపాఠశాలలో విద్యార్థుల ప్రార్థన సమయానికి చేరుకున్న చైర్మన్ ఉపాధ్యాయులతో కలిసి ప్రార్థన చేశారు. ఆయా పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతాన్ని, కావాల్సిన మౌలిక వసతుల గురించి అడిగితెలుసుకున్నారు. మధ్యాహ్నభోజనానికి వాడుతున్న బియ్యం, కూరగాయల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు, రావాల్సిన పెండింగ్ బిల్లులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తనతో పాటు మరో ముగ్గురు కమిషన్ సభ్యులు జిల్లాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను మెరుగైన విద్యాబోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నభోజన నిర్వాహకులకు బిల్లులు ఆలస్యంగా రావడం, యూనిట్ కాస్ట్ తక్కువగా ఉండటం గమనించామని తెలిపారు. ఎంఈవో చంద్రుడు ఉన్నారు.

అలాగే, అమ్రాబాద్ మండలం మన్ననూరులోని ఆదివాసీ గురుకుల విద్యాలయం (పీటీజీ), ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలను రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి శుక్రవారం పరిశీలించారు. మొదట పీటీజీలోని వంట గదితో పాటు, అన్నం, సాంబారు, ఇతర వంటకాల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

డాక్టర్ నిర్లక్ష్యంతో కోమాలోకి రోగి

- రోగి పరిస్థితి విషమం



ప్రైవేట్ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

గద్వాల క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి అయిజ పట్టణానికి చెందిన ఓ మహిళ ముక్కులో గడ్డ ఉందని గత రెండు రోజుల క్రితం రాగా డాక్టర్ వేసిన ఇంజక్షన్‌తో అపస్మారకస్థితిలోకి వెళ్లి చివరకు కోమాలోకి వెళ్లిన సంఘటన శుక్రవారం చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి బాధితులు, డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి గురువారం మధ్యాహ్నం అయిజ పట్టణానికి చెందిన కవిత అనే మహిళ, ఆమె బంధువులు వచ్చారు. కవిత ముక్కులో గడ్డ ఉందని, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉందని.. ఆపరేషన్‌కు రూ. 20వేలు అవుతుందని డాక్టర్ చెప్పారు. దీంతో రోగి బంధువులు రూ. 15వేలకు ఆపరేషన్ చేసేందుకు డాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా డాక్టర్ ఆమెకు మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో వెంటనే స్పృహతప్పి కింద పడిపోయింది. వెంటనే కోమాలోకి వెళ్లడంతో పరిస్థితి సీరియస్‌గా ఉందని కర్నూల్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని డాక్టర్ సూచించాడు. వెంటనే కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా గురువారం నుంచి శుక్రవారం వరకు వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఆమె మెదడులో నరాలు చిట్లిపోయా యని, ఆమె ఎప్పుడు కోమా నుంచి బయటకు వస్తుందో చెప్పడం కష్టమన్నారు. అయితే డాక్టర్ వేసిన ఇంజక్షన్ వల్లే ఇబ్బందులు ఏర్పడ్డాయని బాధితులు విలేకరులతో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం సాయంత్రం గద్వాలలో ఆసుపత్రిని తనిఖీ చేశారు. పేషెంట్‌కు సంబంధించిన అన్ని వివరాలను సేకరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప ఆదేశాల మేరకు సదరు డాక్టర్‌కు షోకాజ్ నోటీస్‌ను అందజేశారు.

ధాన్యాన్ని నూరు శాతం

కొనుగోలు చేయాలి

- రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మహబూబ్‌నగర్‌లో అధికారులతో సమీక్ష

4

తెలంగాణ సాధకుడు కేసీఆర్

- దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి విజయసింహారెడ్డి - పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు



దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి విజయసింహారెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు

నాగర్‌కర్నూల్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సబ్బండ వర్గాలను చైతన్యం చేసి మలి దశ ఉద్యమానికి శ్రీకారం చుట్టి తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన యోధుడు కేసీఆర్ అని దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే విజయసింహారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి దీక్ష దివస్ జిల్లా ఇన్‌చార్జి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే విజయసింహారెడ్డితో పాటు బీఆర్ఎస్ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్‌రెడ్డి, గుర్కా జైపాల్ యాదవ్, బీరం హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి తెలం గాణ తల్లి విగ్రహానికి నివాళులు అర్పించారు. వారంతా పూలమాలలు ధరించి సామూహిక దీక్ష చేపట్టారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ కేసీఆర్ లేకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని రేవంత్‌రెడ్డి నేడు కేసీఆర్ పోరాట ఫలితంగా వచ్చిన తెలంగాణలో సీఎం అయ్యారనే సంగతి గుర్తించాలన్నారు. నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటున్న సీఎం రేవంత్‌రెడ్డి జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆనవాలు లేకుండా చేస్తావా అని ప్రశ్నించారు. కేసీఆర్ లేకుంటే డిసెంబరు 9 లేదనే సంగతి గుర్తించాలన్నారు. మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, బీరం హర్షవర్దన్‌రెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట మునిసిపల్ చైర్మన్‌లు కల్పన, ఎడ్మ సత్యం, నరసింహగౌడ్, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ విజితారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, నాగం శశిధర్‌రెడ్డి, రంగినేని అభిలాష్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ హనుమంతరావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.





నేడు పాలమూరుకు సీఎం రేవంత్‌రెడ్డి

- లక్ష మంది రైతులతో సదస్సు
- సీఎం చెప్పే శుభవార్త కోసం ఎదురుచూపు
- విజయవంతంగా సాగుతున్న రైతు పండగ
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్‌శాఖ


సీఎం సభకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్, నవంబరు 29: పాలమూరులో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్ర రైతు సదస్సులు రెండు రోజులు విజయవంతంగా పూర్తి కాగా, చివరి రోజు శనివారం సదస్సుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. మొదటి రోజు ఉమ్మడి జిల్లాకు చెందిన రైతులు వేలాదిగా తరలిరాగా, రెండో రోజు ఉమ్మడి పాలమూరుతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. రైతుల రాకతో సదస్సుకు పండుగ కళ వచ్చింది. సీఎం సభ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభాప్రాంగణాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పరిశీలించారు. లక్ష మంది రైతులతో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ఆయా నియోజకవర్గాలలో సన్నాహక సదస్సులు ఏర్పాటు చేసి, బూత్‌కు వంద మందిని సభకు తరలించాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. బస్సులు, ఇతర వాహనాలలో రైతులను, జనాలను సభకు తరలించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో ప్రతిష్టాత్మకంగా రైతు పండగ సభలు నిర్వహిస్తుండటం, రైతులకు సీఎం శుభవార్త చెబుతారని మంత్రులు చెబుతుండటంతో ఆ వార్త కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 21 లక్షల మందికి రూ.18 వేల కోట్ల రుణాలు మాఫీ చేశారు. రూ.రెండు లక్షలలోపు రుణాలు తీసుకున్న పలువురు రైతులకు సాంకేతిక కారణాల వల్ల మాఫీ కాలేదు. వారి మాఫీపై ముఖ్యమంత్రి ప్రకటన చేస్తారని, అదేవిధంగా రూ.రెండు లక్షలపైన రుణం ఉన్న రైతుల విషయంలో స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక రైతులనుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యానికి వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమచేయడం, సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యం మొత్తానికి బకాయి లేకుండా చెల్లింపులు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. శనివారం సాయంత్రం వరకు బోనస్ మొత్తం చెల్లించనున్నారు. ఇక రైతు భరోసాపై ముఖ్యమంత్రి ఏం చెప్పబోతున్నారన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. ఈ ఏడాది వానాకాలం రైతుభరోసా ఇవ్వలేదు. సంక్రాంతి లోపు ఇస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎకరాకు పెంచుతామన్న రూ.15 వేలు ఇస్తారా?.. ఎన్ని ఎకరాలకు ఇస్తారు?.. నిబంధనలు ఏంటన్న ఉత్కంఠ అందరిలో నెలకొంది. సంక్రాంతికి పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉండటంతో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందుగానే ఆసరా పింఛన్‌పై ఇచ్చిన హామీపై శుభవార్త చెబుతారా అన్న ప్రచారం సాగుతోంది.

సీఎం సభకు భారీ బందోబస్తు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీస్‌శాఖ అలర్ట్ అయ్యింది. ఐజీ సత్యనారాయణ, మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పోలీసులతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన దాదాపు రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

పార్కింగ్‌లకోసం

సీఎం సభకు పెద్ద సంఖ్యలో వాహనాలు వచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్‌లను సిద్ధం చేశారు. అందుకు రెండు చోట్ల స్థలాలను కేటాయించారు. హైదరబాద్ నుంచి జడ్చర్ల మీదుగా వచ్చే వాహనాలు జడ్చర్ల ఫ్లైఓవర్ ఎక్కడకుండా కింది నుంచి మహబూబ్‌నగర్ రూట్‌లో వచ్చి, పిస్తాహౌస్ నుంచి బైపాస్ మీదుగా భూత్పూర్ రోడ్‌కు చేరుకోవాలి. అక్కడి నుంచి భూత్పూర్ వెళ్లే దారిలో గిరిధారి వెంచర్ ఎదురుగా ఏర్పాటు చేసిన పార్కింగ్ 1లో వారు వాహనాలు పార్కింగ్ చేయాలి. మక్తల్, నారాయణపేట, కోడంగల్ నుంచి మహబూబ్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా వన్‌టౌన్ మీదుగా వెళ్లి పార్కింగ్ 1లోనే పార్కింగ్ చేయాలి. గద్వాల, అలంపూర్, వనపర్తి, బిజినపల్లి నుంచి వచ్చే వాహనాలు భూత్పూర్ ఫ్లైఓవర్ దిగగానే ఎడమ వైపు టర్న్ తీసుకుని భూత్పూర్ పార్కింగ్ 2లో పార్క్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

ట్రాఫిక్ మళ్లింపు

మహబూబ్‌నగర్- భూత్పూర్ రహదారిలో రాకపోకలు సాగించే జనరల్ వాహనాలన్నింటిని శనివారం మధ్యాహ్నం ఒంటి గంటనుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు దారి మళ్లించారు. భూత్పూర్ నుంచి మహబూబ్‌నగర్ వచ్చే వాహనాలు జడ్చర్ల నుంచి మహబూబ్‌నగర్ రూట్‌లో వెళ్లి పిస్తాహౌస్ వద్ద బైపాస్ మీదుగా మహబూబ్‌నగర్‌కు, మహబూబ్‌నగర్ నుంచి భూత్పూర్ వెళ్లే వాహనాలు భూత్పూర్ రోడ్‌లో బైపాస్ వద్ద మళ్లి పిస్తాహౌస్ మీదుగా జడ్చర్లకు, అక్కడినుంచి భూత్పూర్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

భోజనాలకు రోజూ 12 క్వింటాళ్ల బియ్యం

రైతులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

రైతు సదస్సుకు వచ్చే రైతుల కోసం భోజనాలకు రోజూ 12 క్వింటాళ్ల బియ్యాన్ని వాడుతున్నారు. రోజూ ఆరు నుంచి ఏడు వేల మందికి భోజనం పెడుతున్నారు. అన్నం, పప్పు, వంకాయ, సాంబరు, మజ్జిగ వడ్డిస్తున్నారు. ఎంతమంది రైతులు వచ్చినా ఇబ్బందులు పడకుండా దాదాపు 21 కౌంటర్లను ఏర్పాటుచేసి, భోజనం పెడుతున్నారు. కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ శుక్రవారం రైతులతో కలిసి భోజనం చేశారు.


భోజనం చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

ప్రకృతి వ్యవసాయమే మానవాళి మనుగడను కాపాడుతుంది

● అభిప్రాయపడ్డ మేధావులు, శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు

భూత్పూర్/పాలమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే మానవాళి మనుగడ సాఫీగా కొనసాగుతుందని మేధావులు, ఆదర్శ రైతులు, శాస్త్రవేత్తలు వారి-వారి అభిప్రాయాలను వివరించారు. విషతుల్యమైన ఆహారం తీసుకోవడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై శాస్త్రవేత్తలు, రైతులు మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ ప్రాంతంలోని అమిస్తాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన రైతు పండుగ విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దేవరకద్ర నియోజవర్గ ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి అధ్యక్షతన రెండవ రోజు మేధావుల, శాస్త్రవేత్తల, ఆదర్శ రైతుల అభిప్రాయ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై రైతుల వరుసలో కూర్చొని శ్రద్ధగా ఒక్కొక్క ఆదర్శ రైతులు వారి-వారి అనుభాలను, వ్యవసాయంలో సాధించిన విజయాలను చెపుతుంటే మంత్రి శ్రద్ధగా విన్నారు. ఆదర్శ రైతులు లావణ్య, వీరస్వామిలను మంత్రి శాలువాతో సన్మానించారు.


రైతుల అభిప్రాయాలను శ్రద్ధగా వింటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఈ సందర్భంగా రైతుల సూచనలను సంబంధిత శాఖ అధికారులు నోట్ చేసుకోవాలని, వీలును బట్టి రైతుల అవసరాలను తీర్చడానికి కృషి చేయనున్నట్లుగా మంత్రి స్పష్టం చేశారు. అంతకు ముందు ఉదయం 10:30 గంటలకు వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ శాస్త్రవేత్తలు సుచరిత్ర, అనితా కూమారి జ్యోతి, వ్యవసాయ శాఖ అదనపు సంచాలకురాలు సరోజిని దేవి తది తరులు వివిధ రంగాల్లో అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు, సలహాలను అందించారు. ముఖ్యంగా శాస్త్రవేత్త సుచరిత్ర పండ్ల తోటల సాగులో యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ చర్యలు ఎలా తీసుకోవాలి వరి, ఇతర పంటలకు బదులుగా పండ్ల తోటలను ఎలా పెంచుకోవాలి.. లాభాలు ఎలా వస్తాయి... అనే విషయాలను చాలా చక్కగా రైతులకు వివరించారు.

అదే విధంగా ఆయి ల్‌పామ్ తోటల సాగు గురించి శాస్త్రవేత్తలు రైతులకు ప్రొజెక్టర్ ద్వారా చాయా చిత్రా లను చూపిస్తూ చక్కగా వివరించారు.

కళా కారుల ఆట- పాటలతో రైతు సదస్సు సా ఫీగా సాగింది.

కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో లాభసాటి వ్యవసాయం



మన నేలను మనమే పాడు చేసుకుంటున్నాం. మన పూర్వీకులు పెంట ఎరువులతో మంచి లాభసాటి వ్యవసాయం సాగు చేసి ఎలాంటి రోగాలు రాకుండా మన పూర్వీకులు నూరేళ్ల హాయిగా జీవనాన్ని కొనసాగించారు. అదే విధంగా మనం ఎందుకు చేయలేమన్న ఆలోచన నాలో గత పదేళ్ల క్రితం వచ్చింది. అనుకున్నట్లుగానే నేను మన పూర్వీకుల మాదిరిగా ఆవులు, గేదెలు, కోళ్లు, మేకలు, సమష్టి వ్యవసాయం వైపు దృష్టి మళ్లించాను. ప్రకృతి వ్యవసాయం చాలా దృఢ సంకల్పంతో జీవామృతం, కషాయాలు వాటిని వాడి అన్నీ రకాల పంటలను పండిస్తున్నాను.

- అంజిరెడ్డి, ఆదర్శ రైతు, నల్లగొండ

సమష్టి వ్యవసాయంతో చాలా లాభాలు



మన పూర్వీకుల మాదిరిగా మన మందరం కలిసి సమష్టిగా ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయి. వ్యవసాయ పొలాల్లో మిగిలిపోయి ఉన్న వ్యర్థలాను చాలా మంది రైతులు కాల్చి వేస్తుంటారు. దాని వల్ల మన పంట పొలాలను మనమే నాశనం చేసుకుంటున్నాం. మన వ్యవసాయంలో మిగిలిపోయిన వ్యర్థ పదార్థాలను వర్మి కంపోస్టు ఎరువులుగా వాడుకున్నట్లయితే మంచి లాభాలను పొందవచ్చు. రైతులంతా కలిసి ప్రకృతి వ్యవసాయం వైపు కృషి చేస్తే మంచి దిగుబడులు ఇచ్చే పంటలను పొందవచ్చు.

- జ్ఞానేశ్వర్‌రెడ్డి, ఆదర్శ రైతు, కోటకదిర

విత్తనాలను మనమే తయారు చేసుకోవచ్చు



చాలా మంది రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులను వాడుతున్నారు. ఇది మానవాళికి చాలా ప్రమాదకరమైన ఆహారంగా మారుతుంది. మన పంటల్లోనే మంచి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని, ఎలాంటి మందులు వాడకుండా జీవామృతం వాడి ప్రకృతి సేద్యం చేసుకొన్నట్లయితే మంచి ఆహారాన్ని ప్రజలకు అందించిన వాళ్లం అవుతాం. నేను గత 30 ఏళ్లుగా జీవామృతం ఎరువులు వాడుకుంటూ.... మంచి నాణ్యమైన పంటలను పండిస్తున్నాను.

- ఆదర్శ రైతు లావణ్య

ఇంజనీరింగు వదులుకొని వ్యవసాయంలోకి వచ్చా



నేను ఇంజనీరింగు వరకు చదువుకున్నా. ఉద్యోగాల కోసం ప్రయత్నించకుండా నా సొంత తెలివితో మన ప్రకృతితో వ్యవసాయం ఎందుకు చేయకూడదన్న ఆలోచనతో తీగ జాతి కూరగాయల సాగుపై దృష్టి సారించాను మొదట్లో పంట నష్టం వచ్చింది. అయినా వదలలేదు. వేసవిలో తీగ జాతి టమాటాలను ఎలా పండించుకోవాలి అనే విషయంపై కొంచం కష్టంగా ఉన్నా ప్రయత్నించాను. అనుకున్న దానికంటే మంచి దిగుబడి వచ్చింది. అదే విధంగా బంతి పూల సాగు చాలా మంచి దిగుబడులను ఇచ్చింది.

- పల్లె వినోద్‌కుమార్, రైతు నల్లగొండ

రైతులే ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

ఈర్లపల్లిశంకర్, చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులను ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రసంగించారు. దేశంలోనే అత్యధిక వరి సాగు చేసిన రాష్ట్రంగా తెలంగాణ రికార్డ్ సృష్టించిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వానాకాలంలో రికార్డు స్థాయిలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించారని గుర్తు చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా పెద్దఎత్తున కొనుగోలు చేయడంతో పాటు వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తుందన్నారు. రైతులకు ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. ఎన్ని ఇబ్బందులున్నా రైతుపక్షపాతిగా వారి సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం ఏం చేయాలో రైతులే చెప్పాలన్నారు. అనుభవం కలిగిన ప్రతీ రైతు శాస్త్రవేత్తనేనని, వారి ఆలోచనలకు అనుగుణంగానే ఈ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. రైతుల అభిప్రాయాల మేరకు పథకాల రూపకల్పన చేస్తామన్నారు. వలసల జిల్లాగా పేరున్న పాలమూరుకు ఆ పేరు పోవాలంటే జిల్లాకు అత్యంత ప్రాధాన్యమైన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణలో బీడు భూములు కనిపించబోవన్నారు. వచ్చే సంవత్సరం ఈ జిల్లాకు ఇతర జిల్లాల నుంచి వచ్చి పనిచేయాలే తప్ప.. ఈ జిల్లా నుంచి బయటకు పోరన్నారు. రైతులు ఒకేరకమైన పంటలు పండించే విధానాన్ని మార్చుకోవాలన్నారు. పామ్‌ఆయిల్ పంటలతో మంచి లాభాలు ఉంటాయన్నారు. ఈ తోటలు పెడితే రైతుబంధు, రుణమాఫీపై ఆధారపడే పని ఉండదని, అప్పులు, బోనస్‌లకోసం ఎదురుచూడాల్సిన అవసరం రాదని అన్నారు. ఎండాకాలం పంట మార్చి లోపల కోతలు ప్రారంభిస్తే బియ్యంలో నూకల శాతాన్ని తగ్గించవచ్చన్నారు.

ఎండాకాలం పంటకు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో అధికారులు త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. రైతులకు ఈ ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతుకమిషన్ అధ్యక్షుడు కోదండరెడ్డి, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు, కమిషనర్ గోపి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి పాల్గొన్నారు.


ప్రత్యేక సీతాఫలం ప్రత్యేకతను వివరిస్తున్న డీహెచ్‌ఎస్‌వో వేణుగోపాల్

● అందరికీ ఎన్ఎంకే గోల్డ్ రకం సీతాఫలం

స్థానికంగా పండే సీతాఫలం అక్టోబరుకు పూర్తవుతుంది. నవంబరు, డిసెంబరులో సీతాఫలం(ఎన్‌యంకె గోల్డ్ రకం)లోను అందుబాటులో ఉంటుంది. ఇందులో గింజ తక్కువ, గుజ్జు అధికం, ఎక్కువగా ఐస్‌క్రీమ్‌లో వాడటానికి ఉపయోగపడుతుంది. మామూలు పండు మక్కిన రెండురోజులకు పాడైతే, ఇది వారం వరకు తాజాగా ఉంటుంది. జడ్చర్ల పట్టణానికి చెందిన బాదిమి రవిశంకర్ పండించిన సీతాఫలంను స్టాల్‌లో ప్రదర్శనకు ఉంచారు.


ప్రజలకు వివరిస్తున్న పి.వెంకటరమేష్, ఎస్ఈ, ఎస్‌పీడీసీఎల్

● సూర్యఘర్ పథకంలో అందరికీ ఉచిత విద్యుత్

సూర్యఘర్ పథకంలో ఇంటిపైన సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుంటే అందరికి ఉచిత విద్యుత్ పొందవచ్చు. 3కిలో వాట్స్‌కు రూ.లక్షా 90వేల ఖర్చు(రూ.78వేలు సబ్సిడీ)తో ఏర్పాటు చేసుకుంటే.. పెట్టుబడి ఐదేళ్లలో మొత్తం తిరిగి వస్తుంది. 25ఏళ్ల వరకు ఏర్పాటు చేసిన పరికరాలు మన్నికంగా ఉంటాయి. 20ఏళ్ల పాటు ఉచిత విద్యుత్ వాడుకునే అవకాశం ప్రతి ఒక్కరు పొందవచ్చు.


రైతులకు ఆయిల్‌ఫామ్ ప్రాముఖ్యతను వివరిస్తున్న అధికారులు

● రైతును రాజును చేసే ఆయిల్‌పామ్

పెట్టుబడి నుంచి పంట చేతికొచ్చే వరకు ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో సహకారం అందిస్తోంది. ఉమ్మడి జిల్లాలో అన్నిచోట్ల రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. మూడేళ్ల తరువాత పంట చేతికి వస్తుంది. సుమారు 30ఏళ్ల వరకు దిగుబడి వస్తూనే ఉంటుంది, మధ్యలో అంతర పంటలు వేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆయిల్‌పామ్‌ను నమ్మండని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు నేను గ్యారంటీ అని చెబుతున్నారు.

మైనింగ్ మాఫియాను అడ్డుకుంటాం

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

బల్మూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా వ్యతిరేక పాలసీలు తీసుకొస్తున్న ప్రభుత్వాలకు ప్రజలు గట్టి బుద్ధి చెబుతారని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మైలారం గ్రామంలో ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలారం గ్రామానికి ఆనుకుని ఉన్న గుట్టపై మైనింగ్ మాఫియా దాపరించిందని, దానిని తరిమి కొట్టేందుకు ప్రజలు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామస్తులు మైనింగ్ పనులు చేపట్టవద్దని ఓటు కూడా వేయకుండా వదులుకున్న సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. గుట్టను తవ్వుతున్న మైనింగ్ మాఫియాకు తోడుగా ప్రజాప్రతినిధులు పోలీసులు అండదండలు ఎంతో కాలంగా కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. గుట్టను కాపాడుకునేందుకు గ్రామంలో నూతన కమిటీని ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా న్యాయబద్ధంగా న్యాయమూర్తుల సలహాలతో ముందుకెళ్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాలయ్య, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమ కన్వీనర్ చంద్రమౌళి, నాయకులు వెంకటేశ్ పాల్గొన్నారు.

గద్వాల డీఈవో బాధ్యతల స్వీకరణ

గద్వాల టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా విద్యాశాఖ అధికారిగా అ బ్దుల్ ఘని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఈవో కార్యాలయం సిబ్బంది శాలువాతో సన్మానించి, పూలకుండిని అందజేసి శుభా కాంక్షలు తెలిపారు. విద్యాశాఖ కార్యాలయ పర్యవేక్ష కులు విజయలక్ష్మి, రామకృష్ణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

అనంతరం డీఈవో కలెక్టర్ బీఎం సంతోష్‌ను చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా సమావేశ మైన పలు అంశాలపై చర్చించుకున్నారు.

ధాన్యాన్ని నూరు శాతం కొనుగోలు చేయాలి

- రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

మహబూబ్ నగర్ కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని నూటికి నూరు శాతం కొనుగోలు చేసి కేంద్రాల నుంచి తరలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ట్యాబ్ ఎంట్రీ 100 శాతం పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మహబూబ్ నగర్ జిల్లా సమీకృత జిల్లా అధికారుల కార్యాలయంలోని కలెక్టర్ చాంబర్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డితో కలిసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజా ప్రతినిధులతో వానాకాలం ధాన్యం సేకరణపై సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్నీ జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే శనివారం లోపు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసి చెల్లింపులు చేయాలన్నారు. వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాలో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఎక్కువగా ఉందని, తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా చెల్లింపులు వెంటనే చేయాలని చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ శనివారంలోపు పెండింగ్‌లో ఉన్న రైతులకు చెల్లించాల్సిన మొత్తం చెల్లింపులు చేయాలని, అలాగే ట్యాబ్ ఎంట్రీ సైతం పూర్తి చేయాలని చెప్పారు.

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో ప్రస్తుతం ఉన్న ధాన్యాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెంటనే తరలించడంతో పాటు చెల్లింపులు సైతం త్వరగా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో తరుగు ఎక్కువగా తీస్తున్నారని అన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ సన్నధాన్యం రైతులకు బోనస్ ఎక్కువగా పెండింగ్‌లో ఉందని, త్వరగా చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అంతకు ముందు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరేట్ కమిషనర్ డీఎస్ చౌహాన్ మాట్లాడారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, నారాయణ పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అచ్చం పేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డితో పాటు, రాష్ట్ర పౌరసరఫరాల అధికారులు, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, ఉమ్మడి జిల్లాలా అదనపు కలెక్టర్‌లు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

అన్నీ ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేస్తాం

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అన్ని ప్రాజెక్ట్‌లను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రుత నిశ్చయంతో ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మహబూబ్ నగర్ కలెక్టర్ చాంబర్‌లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, రాష్ట్ర స్థాయి నీటిపారుదల శాఖ అధికారులు, ఉమ్మడిజిల్లా ప్రజాప్రతినిధులతో సమీక్ష నర్వహించారు. ముందుగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్యేలు వారి వారి నియోజకవర్గ పరిధిలోని ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల పై మాట్లాడిన అనంతరం నీటిపారుదల శాఖ మంత్రి మాట్లాడారు.

మహబూబ్‌నగర్‌లో క్రీడా సంబురం

● నేటి నుంచి రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం రాష్ట్ర స్థాయి క్రీడా పండుగకు వేదికానుంది. జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో శనివారం నుంచి డిసెంబరు రెండో తేదీ వరకు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-17 బాల, బాలికల రగ్బీ టోర్నీ నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు పట్టణ ప్రజలకు కనువిందు చేయనున్నాయి. పోటీల కోసం ఎస్‌జీఎఫ్ అండర్-17 కార్యదర్శి శారదాబాయి, టోర్నీ ఆర్గనైజర్ నిరంజరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం వాటిని పరిశీలించారు. బాలికలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో, బాలురకు స్టేడియంలో బస కల్పిస్తున్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో భోజన వసతి కల్పిస్తున్నారు.

పాల్గొననున్న 10 జిల్లాల జట్లు

పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలు మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మెదక్, నల్గొండ, నిజామాబాద్, వరంగల్ జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు తలపడనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డీఈవో ప్రవీణ్‌కుమార్ ప్రారంభించనున్నారు. డీవైఎస్‌వో శ్రీనివాస్ హాజరుకానున్నారు.

టోర్నీకి ఏర్పాట్లు పూర్తి

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17 బాల, బాలికల రగ్బీ టోర్నీకి మహబూబ్‌నగర్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. 10 జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు రానున్నారు. వారికి బస, భోజన వసతికి కల్పిస్తున్నాం. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, టోర్నీ ఆర్గనైజర్ పోటీలను పర్యవేక్షిస్తారు. టోర్నీని అందరి సహకరంతో విజయవంతంగా నిర్వహిస్తాం.

-ఏ ప్రవీణ్‌కుమార్, జిల్లా విద్యాశాఖధికారి, ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు

మహబూబ్‌నగర్ జిల్లా జట్టు వివరాలు

బాలుర జట్టు: బాలుర జట్టులో శివకుమార్, నందిశ్వర్‌రెడ్డి, శివనాయక్, వరుణ్, నరహరి, తిరుమలేశ్, రాంచరణ్, రేవంత్‌కుమార్, యువరాజ్, పాల్, వరుణ్‌తేజ, యశ్వంత్, బి.వరుణ్‌తేజ్, మధు, అనిల్‌కుమార్, బి.అనిల్‌కుమార్ పాల్గొననున్నారు.

బాలికల జట్టు: బాలికల జట్టులో ఉమా, చరిత, శైలజ, సుచరిత, యామిని, ఉరుకుంద, రాధిక, మీనాక్షి, నిఖిత, ప్రవలిక,హరిత, పూజా, మానస, శ్రీకృతి, ప్రీతి పాల్గొననున్నారు.

స్పోర్ట్స్ బాక్స్

జాతీయ స్థాయికి ఎంపికవ్వాలి

▸ మూసాపేట ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి



విద్యార్థులు అంజలి, శిరీష, వెంకటరమణలతో ఉపాధ్యాయులు

మూసాపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి, జాతీయ స్థాయికి ఎంపిక కావాలని మూసాపేట ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు వెంకటరమణ, అంజలి, శిరీష ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాలో వారిని ఎంఈవో అభినందించారు. అనంతరం మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో వచ్చేనెల ఏడు నుంచి తొమ్మిదో తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ శన్నప్ప, గోవర్ధన్‌రెడ్డి, నాగార్జున, నర్సప్ప, శివరాజు, సతీశ్, సత్తయ్య, శోభా రాణి, అరుణ, రాధ, గీతజ్ఞాన, సుగుణ, సీజీ మధుసూదన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొండాపూర్ విద్యార్థులు



విద్యార్థులు శివ, మోహన్‌లతో వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌నాయక్, ప్రిన్సిపాల్ రాజారాం, పీఈటీ ఆంజనేయులు

ధన్వాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం, కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు శివ, మోహన్ రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీలకు పోటీలకు ఎంపికయ్యారు. శనివారం నుంచి వచ్చే నెల రెండవ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అండర్ - 14 పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ సాంబయ్య శ్రీనివాస్ నాయక్, కోచర్ రాంమోహన్‌గౌడ్, పీఈటీ అంజనేయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వరికోత యంత్రం ఢీకొని వ్యక్తి మృతి

▸ పార్చర్ల గ్రామ స్టేజీ సమీపంలో ఘటన

ధరూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరు మండల పరిధిలోని పార్చర్ల గ్రామ స్టేజీ సమీపంలో శుక్రవారం సాయంత్రం వరికోత యంత్రం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ అబ్దుల్ షుకూర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాలకు చెందిన వడ్డే గోవిందు(35) ద్విచక్ర వాహనంపై రాయచూర్ నుంచి గద్వాలకు తిరిగి వస్తుండగా, పార్చర్ల స్టేజీ సమీపంలో వరికోత యంత్రం ఢీకొన్నది. గమనించిన స్థానికులు అతడిని అంబులెన్స్‌లో గద్వాల ఏరియా ఆస్పత్రి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్ఐడీ స్వర్ణోత్సవాలు

మరువలేని.. మధుర జ్ఞాపకాలు

గుర్తు చేసుకున్న ప్రముఖులు

కొల్లాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో రాణీ ఇందిరాదేవి పాఠశాల, కళాశాల స్వర్ణోత్సవాలు మూడు రోజుల పాటు విజయవంతంగా కొనసాగాయి. ఇక్కడ చదువుకొని, రాష్ట్రంతో పాటు, దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న పలువురు ప్రముఖులు ఉత్సవాలకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆర్ఐడీ పూర్వ విద్యార్థులు మంత్రి జూపల్లి కృష్ణారావు, పారిశ్రామిక వేత్త మై హోమ్ అధినేత జూపల్లి రామేశ్వరరావు, ఢిల్లీ ఐఐటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వలిపె రామ్‌గోపాల్ రావు, ఢిల్లీ బిట్స్ పిలానీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జయరాంరెడ్డి వేదికపై ప్రసంగిస్తూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారి జ్ఞాపకాలు, విశేషాలు మీ కోసం...

ఓ సంఘటన జీవితాన్ని మార్చింది



నా చిన్నప్పుడు జరిగిన ఓ సంఘటన నా జీవితంలో ఎంతో మార్పు తెచ్చింది. చిన్నప్పుడు ఓ రోజు నేను గదిలో కూర్చుని 'జగమే మాయ.. బ్రతుకే మాయ' అనే పాటను సాధన చేస్తున్నాను. అప్పుడు మా అమ్మ వచ్చి ఈ పాట ఎందుకు పాడుతున్నావని అడిగారు. గణపతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే పాటల పోటీలో పాల్గొనేందుకు పేరు ఇచ్చానని, అందుకే ప్రాక్టీసు చేస్తున్నానని చెప్పాను. ఆ తర్వాత ఉత్సవాల్లో అదే పాట పాడాను. కానీ మా సార్ ఈ పాట పాడటం బాగా లేదంటూ నన్ను బయటకు పొమ్మన్నారు. దీంతో నేను ఏడుస్తూ ఇంటికి వచ్చేశాను. ఈ సంఘటన నా జీవితంలో చాలా మార్పు తెచ్చింది. నేనేంటో నిరూపించుకోవాలని నిర్ణయించుకున్నాను. కష్టపడి చదివి ఈ స్థాయికి చేరాను.

- ప్రొఫెసర్ జయరాంరెడ్డి, ఢిల్లీ, బిట్స్ పిలానీ యూనివర్సిటీ



ఎక్కడా ఎవరితోనూ రాజీ పడలేదు

తల్లిదండ్రులు, అన్నలు, గురువులు నేర్పిన విలువలను కాపాడటంతో ఎక్కడా, ఎప్పుడూ, ఎవరి తోనూ రాజీ పడలేదు. ఆర్ఐడీ పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్నాను. లెక్కల మాస్టర్ కటికనేని పురుషోత్తంరావు సార్, ఎస్ నారాయణ సార్ వద్ద ట్యూషన్‌కు వెళ్లి చదువుకున్నాను. తల్లిదండ్రులు శేషగిరిరావు, రత్నమ్మలతో పాటు ఐదుగురు అన్నలు జీవిత విలువలను నేర్పించారు. 1980తో మా తండ్రి శేషగిరిరావు పెద్ద దగడ గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. అప్పుడు గ్రామ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కోసం ఆయన కొంత డబ్బు ఖర్చు పెటారు. ఆ సమయంలో నేను కొల్లాపూర్ ఎస్‌బీఐలో పని చేస్తున్నాను. ఒక రోజు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిల్లులు డ్రా చేసేందుకు బ్యాంకు వచ్చారు. డబ్బు తీసుకొని, మీ నాన్నగారికి ఇవ్వాలంటూ మూడు వేల రూపాయలు ఇచ్చారు. నేను తీసుకెళ్లి ఆ డబ్బును నాన్నకు ఇచ్చేశాను. ఆయన లెక్కపెట్టుకొని, ఇన్ని డబ్బులు ఎందుకు అన్నారు. నాకేం తెలుసు అని నేను చెప్పడంతో, నేను ఖర్చు పెట్టింది రూ.1200లే అన్నారు. ఆ మిగిలిన డబ్బుతో విద్యార్థులకు దుస్తులో, పుస్తకాలో ఇవ్వొచ్చు కదా అని నేను చెప్పాను. అట్లా కుదరదు.. రూల్ రూలే.. లెక్క లెక్కనే అంటూ, మా నాన్న మిగతా డబ్బును తిరిగి గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేశారు. 42 సంవత్సరాల క్రితం జరిగిన ఈ సంఘటన నాకు నైతిక విలువలను నేర్పింది. ఆయనతో పాటు, ఐదుగురు అన్నలు చూపిన ఉన్నత మార్గంలోనే ఇప్పటికీ నడుస్తున్నాను.

- జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్ శాఖ మంత్రి

హోమ్ వర్క్ చేయకపోతే గోడ కుర్చీ



చిన్ననాటి జ్ఞాపకాలను ఎప్పటికీ మరువలేము. తప్పు చేస్తే టీచర్లు మాతో గోడ కుర్చీ వేయించే వారు.. కర్రతో చేతిపై కొట్టేవారు. నేను ఒకటో తరగతి నుంచి ఏడవ తరగతి వరకు కుడికిల్లలో, ఎనిమిది నుంచి 12వ తరగతి వరకు కొల్లాపూర్‌లో చదువుకున్నాను. పాఠశాలలో, కళాశాలలో ప్రతీ గురువు వద్ద చాలా పాజిటివ్ అంశాలను నేర్చుకున్నాను. హిందీ మాస్టర్ ఖాళీ సమయాల్లో మాతో శ్రీరామ శ్రీరామ అని రాయించేవారు. పరీక్షల సమయంలో సరిగ్గా చదువుకోకుంటే, పేపర్లో కూడా శ్రీరామ శ్రీరామ అని రాసేవాళ్లం. అప్పుడు టీచర్ ఎక్కువ మార్కులు వేసే వారు. అప్పుడు కమ్యూనికేషన్ పెద్దగా ఉండేది కాదు. టీవీలు, ఫోన్లు ఏవీ లేవు. ఊర్లో ఏ కార్యక్రమం అయినా దేవాలయం నుంచే ప్రారంభం అయ్యేది. మేడు కూడా చిన్నప్పుడు దేవాలయం ఆవరణలో ఆడుకునే వాళ్లం. అక్కడి నుంచే నా జీవితంలో ఆధ్యాత్మికత అలవడింది. 1991లో చిన జీయర్ స్వామి పరిచయమయ్యాక, నాతో పాటు, కుటుంబం అంతా ఆధ్యాత్మిక బాటలో నడిచాం. విద్యార్థి దశలో ఉపాధ్యాయులు వస్తుంటే ఎదురుగా ఉండకుండా, పక్కకు తప్పుకునే వాళ్లం. ఇప్పుడు ఉపాధ్యాయులకు విద్యార్థులే క్లాసులు తీసుకునే పరిస్థితి ఉంది. హై స్కూల్‌లో చదువుకునే రోజుల్లో ఒక రోజు హోం వర్క్ చేయకపోతే, టీచర్ నన్ను బెంచీ ఎక్కించారు. నిలబడ్డ కాసేపటికే పక్కనే గోడపై ఎలక్ట్రిక్ స్విచ్‌ను ఆన్ ఆఫ్ చేస్తూ ఉన్నాను. అది మా సార్ గమనించి, 'నువ్వు తప్పు చేస్తేనే పనిష్‌మెంట్‌గా బెంచీ ఎక్కించాను. కానీ నువ్వు మళ్లీ ఇంకొక తప్పు చేశావు' అంటూ బయటికి తీసుకెళ్లి కర్రతో చేతి మీద కొట్టిన సంఘటన ఇంకా గుర్తుంది. అప్పట్లో ఉపాధ్యాయులు ఎంతో కమిట్‌మెంట్‌గా ఉండేవారు. విద్యార్థులను సొంత పిల్లలుగా చూసుకునేవారు. మంచి విషయాలు నేర్చుకోవాలని, అందరితో శభాష్ అనిపించుకోవాలని నేర్పారు. అప్పుడు టీచర్లు నేర్పిన విలువలు మా రక్తంలోనే ఉన్నాయి. అబద్ధం చెప్పొద్దు.. దొంగతనం చేయొద్దు.. చెడు సావాసాలు పట్టొద్దు అని సూచించారు. జీవన విధానంలో గురువులు చూపిన మార్గాన్ని నేటికీ మరువలేను.

- డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు, మై హోమ్ అధినేత

న్యాయాధికారి నేర్పిన జీవిత పాఠం



నా బాల్యమంతా కొల్లాపూర్‌లోనే గడిచింది. ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు ఆర్ఐడి ఉన్నత పాఠశాల, ఇంటర్ ఆర్ఐడీ బాలుర జూనియర్ కళాశాలలో చదివాను. విద్యాభ్యాసం అంతా తెలుగు మీడియంలోనే కొనసాగింది. చదువుకునే రోజుల్లో పాఠశాలలో జరిగిన ఓ ఫంక్షన్‌కు ముఖ్య అతిథిగా న్యాయాధికారి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలకు సంబంధించి లో లెవెల్‌లో కాంపిటీషన్ చాలా ఎక్కువగా ఉంటుందని, హై లెవెల్ లో పోటీ తక్కువగా ఉంటుందని ఆయన చెప్పిన మాట ఇప్పటికీ గుర్తుంది. అదే మాట మనసులో ఉంచుకొని కష్టపడి చదువు కున్నాను. నేను ఉమ్మడి కుటుంబం నుంచి వచ్చాను. ఇంట్లో ఎప్పుడూ 15 మంది వరకు ఉండేవారు. అందరితో కలిసిమెలసి ఉండేవాడ్ని. ప్రతీ రోజు ఐదు నుంచి ఎనిమిది గంటల పాటు ఆడుకునేవాళ్లం. ఇప్పటిలాగా మొబైల్ గేమ్స్ కావు.. అమ్మా నాన్నలు పిలిచే దాకా ఆడుకుంటూనే ఉండేవాళ్లం. చాలా మంది స్నేహితులు ఉండేవాళ్లు. వారిలో కొందరు మా ఇంటి ముందు జరిగే సంతలో బొరుగులు అమ్మే వారు. వారు ఏదైనా పనిమీద బయటకు వెళ్తే నేను కూడా అమ్మేవాడిని. ఇలా ఆ నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.

- ప్రొఫెసర్ వలిపే రామ్‌గోపాల్‌రావు, ఢిల్లీ ఐఐటీ, మాజీ డైరెక్టర్

ముగిసిన ఆర్ఐడీ స్వర్ణోత్సవాలు

- ▸ మూడు రోజులు కొల్లాపూర్‌లో పండుగ వాతావరణం
- ▸ సందడి చేసిన పూర్వ విద్యార్థులు, ప్రముఖులు
- ▸ ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలతో సంబురాలు
- ▸ చివరి రోజు సన్మానాలు, సత్కారాలు



ఆర్ఐడీ పాఠశాల మెట్లపై కూర్చొని విజయకేతనం చూపుతున్న పూర్వ విద్యార్థులు



అప్పటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మంత్రి జూపల్లి, మైహోమ్ రామేశ్వరరావు

కొల్లాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు జరిగిన ఆర్ఐడీ విద్యాసంస్థల స్వర్ణోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆర్ఐడీ ఉన్నత పాఠశాల, ఆర్ఐడీ జూనియర్ కళాశాలల పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట కలవడంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొన్నది. వారందరూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, మిత్రులను ఆత్మీయంగా పలుకరిస్తూ, ఆలింగనాలు చేసుకుంటూ సరదాగా, సంతోషంగా గడిపారు. పట్టణంలోని సురభి రాజా వారి బంగ్లాలో జరిగిన స్వర్ణోత్సవాల్లో మూడవ రోజు ముఖ్య అతిథులుగా ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, మైహోమ్ అధినేత జూపల్లి రామేశ్వరరావు , ఢిల్లీ ఐఐటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వలిపే రామ్ గోపాల్‌రావు, ప్రొఫెసర్ జయరాంరెడ్డి, సురభి రాజా ఆదిత్య లక్ష్మణ్‌రావులు హాజరయ్యారు. ఆర్ఐడీ అల్యూమ్ని అధ్యక్షుడు డాక్టర్ సాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథులు వారి చిన్ననాటి జ్ఞాపకాలను, అనుభవాలను తోటి మిత్రులతో వేదిక నుంచి పంచుకున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ స్వర్ణోత్సవాల సందర్భంగా అందరినీ కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ ఆర్ఐడీ పూర్వ విద్యార్థులందరూ 60, 70 సంవత్సరాల తరువాత ఒకే వేదికపైకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ చదువుకొని ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేయడం హర్షించదగిన విషయం అన్నారు. కొల్లాపూర్ అభివృద్ధి కోసం ఎల్లప్పుడు ముందుంటానని తెలిపారు. మై హోమ్ అధినేత డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు, విద్యార్థులకు మంచి చేయాలని తపనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలకు అంతా మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు హాజరైన పూర్వ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను, పూర్వ విద్యార్థులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారందరూ సరదాగా ఫొటోలు దిగి వీడ్కోలు చెప్పుకున్నారు.



కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు మంత్రులు జూపల్లి, పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లురవి, మైహోమ్ అధినేత రామేశ్వర్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

బుట్ట బొమ్మా.. బుట్ట బొమ్మా..

▸ సినిమా పాటలతో మార్మోగిన కొల్లాపూర్

కొల్లాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : 'బుట్ట బొమ్మా.. బుట్ట బొమ్మా..' 'జై బాలయ్యా.. జైజై బాలయ్యా..', 'భీమ్లా నాయక్.. భీమ్లా నాయక్' తదితర సినిమా పాటలతో కొల్లాపూర్ పట్టణం మారుమోగింది. ఆర్ఐడీ విద్యాసంస్థల స్వర్ణోత్సవాల్లో చివరి రోజు శుక్రవారం రాత్రి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. పట్టణంలోని రామాపురం రహదారిలో, భారీ సినిమా సెట్టింగులతో ఏర్పాటు చేసిన వేదికపై ఇండియన్ ఐడల్ గాయకుడు స్కంద బృందం పాడిన పాటలు జనాన్ని ఉర్రూతలూగించాయి. ప్రముఖ కళాకారుడు శివమణి వాయించిన డ్రమ్స్ మ్యూజిక్‌తో పట్టణం దద్దరిల్లింది. కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలి వచ్చారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, వాకిటి శ్రీహరి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డిలతో పాటు మైహోమ్ అధినేత రామేశ్వర్‌రావు, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు హాజరయ్యారు.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ జైలు శిక్ష

మక్తల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హత్య కేసులో ఇద్దరు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చారు. 2021, మార్చి 29న నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన ముడుమాల్ లింగమ్మ (43)తో విష్ణు, కర్రెనోళ్ల అంజమ్మలు సంతలో పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆమెను సంగంబండ కాలువ వద్దకు తీసుకువెళ్లి మద్యం తాగించారు. ఆ తర్వాత హత్య చేసి, బంగారు చెవి కమ్మలు, పుస్తెల గుండ్లు, కాళ్ల కడియాలను తీసుకొని, మృతదేహాన్ని దహనం చేశారు. ఈ కేసుపై ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప శుక్రవారం కోర్టులో వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో నిందితులు ఇద్దరికీ యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.12 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి మొహ్మద్ అబ్దుల్ రఫీ తీర్పు వెల్లడించారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ఏఎస్‌ఐ కృష్ణయ్యగౌడ్, కోర్టు కానిస్టేబుల్ బీమ్‌రాజ్, కబీర్‌లను ఎస్పీ యోగేష్‌గౌతమ్ అభినందించారు. త్వరలో రివార్డు అందిస్తామని తెలిపారు.

పొలంలో శ్రీరామ విగ్రహం

▸ మడి దున్నుతుండగా అడ్డొచ్చిన నలుపలకల రాయిని గట్టుపై వేసిన రైతు

▸ దానిపై రాముడి బొమ్మ చెక్కి ఉన్నట్లు శుక్రవారం గుర్తింపు

▸ దర్శించుకొని పూజలు చేసిన గ్రామస్థులు

నారాయణపేటరూరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా, రూరల్ మండల పరిధిలోని చిన్న జట్రం శివారులోని పొలంలో శ్రీరాముడి విగ్రహం బయటపడింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్ల బాలస్వామి అనే రైతు తన రెండెకరాల పొలంలో గత వానాకాలం వరి సాగు కోసం మడి దున్నుతుండగా ఒక నలుపలకల రాయి కనిపించింది. దానిని బండరాయి అనుకొని గట్టుకు నెట్టేశాడు. ఆ తర్వాత కురిసిన వర్షాలకు రాయిపై నున్న మట్టి తొలిగిపోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన పంటను తెచ్చుకునేందుకు పొలానికి వెళ్లాడు. అప్పుడు తాను గట్టున వేసిన రాయి కనిపించడంతో దగ్గరకు వెళ్లి పరిశీలించాడు. దానిపై రాముడి చిత్రం చెక్కి ఉండటం గమనించాడు. విషయం ఆ నోటా ఈ నోటా గ్రామస్థులకు తెలియడంతో వచ్చి స్వామిని దర్శించుకున్నారు.



పొలంలో బయటపడిన శ్రీరాముడి విగ్రహం

ఇంటర్వ్యూ..

శాంతి భద్రతలకు విఘాతం కల్గిసే చర్యలు తప్పవు

- 'ఆంధ్రజ్యోతి'తో ఎస్ఐ వెంకట్‌రెడ్డి



ఉప్పునుంతల, నవంబరు 29 :(ఆంధ్ర జ్యోతి) శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఎస్ఐ వెంకట్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో హెచ్చరించారు.

మండలంలో ఎన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

మండలంలో రెండు మూడు గ్రామాలలో సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇప్పుడు పైలెట్ ప్రాజెక్టు కింద ఐదు గ్రామాలలో కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సెలెక్టు చేశాం. మిగతా గ్రామాలలోనూ త్వరలో ఏర్పాటు చేస్తాం.

డ్రగ్స్, గంజాయి నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు.

డ్రగ్స్, గంజాయికి యువత బానిస కాకుండా అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి రవాణా, వాడకం ఉంటే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాం.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ పనులకు, అదికూడా అనుమతి ఉంటేనే తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తున్నాం.

మండలంలో డ్రంకెన్ డ్రైవ్ కింద ఏమైనా కేసులు నమోదు చేశారా?

రోజూ వెహికల్ చెకింగ్ చేస్తున్నాం. డ్రంకెన్ డ్రైవ్ కింద రోజు ఒకటి రెండు కేసులు నమోదు చేస్తున్నాం. రాత్రి పూట రెగ్యులర్‌గా పెట్రోలింగ్ చేస్తున్నాం, వాహనాల తనిఖీలో మైనర్స్ పట్టుపడితే తల్లిదండ్రులను పిలిచి అవగాహన కల్పిస్తున్నాం. డ్రైవింగ్ లైసెన్స్‌లు నెంబర్ ప్లేట్లు, ఆర్సీ లేని వారికి చలాన్ వేస్తున్నాం.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు గిరిజన బాలురు ఎంపిక



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

బల్మూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొండనాగుల గ్రామంలో ఉన్న ఎస్టీ బాలుర వసతి గృహం విద్యార్థులు ఎం.అరుణ్‌కుమార్ పదవ తరగతి, డి.స్వామి 8వ తరగతిలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వసతి గృహ సంక్షేమ అధికారి పాలాది రాములు ఒక ప్రకటనలో తెలిపారు. వసతిగృహంలో ఘనంగా సన్మానించారు. వసతి గృహ సిబ్బంది కే.పర్వతాలు, ఏ.రాజు పాల్గొన్నారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల హెచ్‌ఎం విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రైం కార్నర్

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

కల్వకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితునికి అందజేసిన సంఘటన శుక్రవారం కల్వకుర్తిలో చోటు చేసుకుంది. కల్వకుర్తికి చెందిన శేఖర్ గౌడ్ తన ఫోన్ ఈ నెల 11న పోగొట్టుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానంతో పోయిన ఫోన్‌ను గుర్తించి బాధితునికి సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డిలు అందజేశారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

వెల్దండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసిన యువకుడిపై శుక్రవారం పోలీసులు పోక్సో కేసునమోదు చేశారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఇంటర్ చదువుతున్న బాలికకు ఇన్‌స్టాగ్రాం ద్వారా కాకినాడ జిల్లా వాకాలపూడి గ్రామానికి చెందిన తేజ్‌కుమార్ పరిచయమయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 24న స్కూల్ వద్దకు వచ్చిన యువకుడు మాయమాటలు చెప్పి బాలికను కారులో ఎక్కించుకుని వెళ్లిపోయాడు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేశారు. కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశం మేరకు పోలీసులు విచారణ చేపట్టి తేజ్‌కుమార్‌ను అరెస్టుచేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు, పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నలుగురి రిమాండ్

పదర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉడిమిల్ల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులను శుక్రవారం రిమాండ్ చేసినట్లు పదర పోలీసు స్టేషన్ ఏఎస్సై బాలునాయక్ తెలిపారు. పెళ్లి నిశ్చయమైన ఓ యువతిని తీసుకెళ్లారనే అనుమానంతో గత మంగళవారం రాత్రి ఎనుపోతుల శేఖర్ అనే యువకుని ఇంటిల్లిపాదిపై 11మంది దాడి చేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఆ దాడి ఘటనలో పాల్గొన్న 11మంది నేరస్థులుండగా శక్రవారం ఏడుగురు నిందితులను పట్టుకొని కోర్టులో న్యాయాధికారి ముందు హాజరుపచామని తెలిపారు. అందులో నలుగురిని రిమాండ్ చేయగా మరో ముగ్గురిని షరతులతో కూడిన బెయిల్‌పై విడుదల చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వెల్దండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రవల్లి వాగునుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎర్రవల్లి తండాకు చెందిన రాంపాల్‌నాయక్ అనుమతులు లేకుండా ఇసుకను తరలించడంతో శుక్రవారం పోలీసులు కేసునమోదు చేశారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

కేసీఆర్ వల్లే తెలంగాణ ఏర్పాటు

- మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దీక్ష, ఉద్యమం చేపట్టడం వల్లే తెలంగాణ స్వరాష్ట్రం సాకారమైందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు అమరవీరుల స్తూపానికి దీక్ష దివస్‌ను పురస్కరిం చుకుని స్థానిక నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ద్యావ విజితారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, నాయకులు సూర్య ప్రకాశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

దీక్షతో జనజాగృతం చేసిన కేసీఆర్

అచ్చంపేటటౌన్ : మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆమరణ దీక్షతో తిరుగులేని అస్త్రం సంధించి ప్రతీ తెలంగాణ బిడ్డను ఉద్య మంలో మమేకం చేసింది కేసీఆర్ అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శంకర్ అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, వెంకటయ్య, అంజి, రవీందర్ నాయకులు పాల్గొన్నారు.

కోడేరు మండలంలో..

కోడేరు : దీక్ష దివస్‌లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో తెలంగాణ కోసం అసువులు బాసిన శ్రీకాంత్ చారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీశైలం, విద్య, రాజు, ఆర్కే రామ కృష్ణ, యాపచెట్టు లాలు, ఆది సోమనాత్, బొట్టు వెంకటస్వామి, మాజీ సర్పంచు నాగులపల్లి రాములు, వీరపాగ వెంకటస్వామి, షఫీ, సాయిబాబా, రాముడు, భజన జంపుల మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.



అచ్చంపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన బీఆర్ఎస్ నాయకులు

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

- భార్యతో పాటు మరో ఐదుగురికి రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భార్య ప్రియుడితో కలిసి తన భర్తను హత్య చేసిన సంఘటన ఇది. ఈ సంఘటనపై నాగర్‌కర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శుక్రవారం వివరాలను వెల్లడించారు. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామంలో కీర్తి, జగదీశ్ భార్యాభర్తలు. వీరు ప్రేమించుకుని 2011లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు సాయిఅక్షిత్(12), కూతురు శరణ్య(9)లు ఉన్నారు. జగదీశ్ తండ్రి ఉపాధ్యాయుడిగా పని చేస్తూ మృతి చెందడంతో తండ్రి ఉద్యోగం జగదీశ్‌కు రావడంతో బిజినేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇదే క్రమంలో అతని భార్య కీర్తి కల్వకుర్తికి చెందిన ఎస్‌బీఎం రియల్ ఎస్టేట్ సంస్థలో సేల్స్‌మన్‌గా పని చేయడానికి వెళ్లింది. అక్కడ బిజినేపల్లి మండలం గుడ్లనర్వ గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. వీరిద్దరి వివాహేతర సంబంధం ఇరు కుటుంబా ల్లో తరచూ గొడవలు జరుగుతుందేవని డీఎస్పీ పేర్కొన్నారు. గ్రామ పెద్దల సమక్షంలో నచ్చజెప్పినా కీర్తి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఎలాగైనా భర్తను అడ్డు తొలగించుకోవాలని పథకం రచించింది. నాగర్ కర్నూల్‌లో నివాసం ఉంటున్న కీర్తి, జగదీశ్ దంపతులు నవంబరు 24న దైవద ర్శనం పేరిట గద్వాలకు వెళ్లారు. అక్కడి నుంచి ప్రియుడు నాగరాజుతో కల్లు తెప్పించి అందు లో విషం కలిపించి భర్త జగదీశ్‌కు తాగిం చింది. స్పృహ కోల్పోయిన జగదీశ్‌ను తీసుకుని తూడుకుర్తి శివారులో గల వారి వ్యవసాయ పొలం దగ్గర కు వచ్చి కరెంటు షాక్‌తో హత్య చేయాలని పూనుకున్నారు. చివరకు అక్కడ కరెంటు లేక పోవడంతో కేఎల్ఐ కాల్వ దగ్గరకు తీసుకెళ్లి ప్రియుడు నాగరాజు, అతని స్నేహితులు సా యికుమార్, పద్మ, సుధాకర్, మోహన్ గౌడ్‌ల సహాయంతో కేఎల్ఐ కాల్వ నీటిలో పడేశారు. బిజినేపల్లి శివారులో మరుసటి రోజు శవమై కన్పించడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుని తరపున పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతుని భార్య కీర్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసింది తానేనని అంగీక రించింది. ఈ కేసులో కీర్తి, నాగరాజు, కీర్తి సో దరుడు సాయికుమార్, కీర్తి తల్లి పద్మ, వీరికి సహకరించిన శివ, సుధాకర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. హత్యకు సహకరించిన మరో వ్యక్తి మోహన్ గౌడ్ పరారీలో ఉన్నాడని, త్వరలో అరెస్టు చేస్తామన్నారు.కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్యగౌడ్, బిజినేపల్లి ఎస్ఐ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ హత్య కేసును సీఐ కనకయ్య, బిజినేపల్లి ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు చాకచక్యంగా ఛేదించినందుకు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బుర్రి శ్రీనివాస్

జిల్లాలో మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లికి వినతి

కొల్లాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో మహిళా అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉందని, దానిని రూపు మాపేందుకు జిల్లాలో మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని శుక్రవారం తెలంగాణ మహిళా అధ్యయన వేదిక అధ్యక్షురాలు విమల కోరారు. వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఐలమ్మ మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే మహిళలు విద్యా పరంగా అభివృద్ధి సాధిస్తారని అన్నారు. దీనిపై మంత్రి, ఎంపీ స్పందిస్తూ త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మహిళా యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

మద్దిమడుగు మహిమాన్విత క్షేత్రం

పదర నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నల్లమలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి క్షేత్రం మహిమానిత్వం అని రాష్ట్ర ఎలక్ట్రానిక్ సర్వీస్ డెవలప్‌మెంట్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి విజయ్ భాస్కర్ గౌడ్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని మద్దిమడుగు పుణ్యక్షేత్రాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు శ్రీశైల ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరంలో శివుని సన్నిధిలో పూజలు చేసి వేద పండితుల చేత ఆశీర్వచనాలు తీసుకున్నారు. మద్దిమడుగు పుణ్యక్షేత్రంలో నిత్యన్నదానానికి విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో మద్దిమడుగు ఆలయ చైర్మన్ రాములు, ప్రధాన అర్చకులు వీరయ్య శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

ఐతోలు విద్యార్థులకు వన భోజనాలు

తాడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐతోల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఆలయ అర్చకుడు హరికృష్ణ శుక్రవారం వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రామ సమీపంలో ఉన్న మామిడితోటలో వన భోజనాలు నిర్వహించి భారత్ మాత చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులు విద్యతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించాలని కోరారు. ఉపాధ్యాయులు వీరేశ్, అఖిల్, రామ్‌కిషన్ పాల్గొన్నారు.



ఐతోల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వన భోజనాలు చేయిస్తున్న ఆలయ అర్చకుడు హరికృష్ణ

ప్రతీ విద్యార్థి పోటీ పరీక్షలో పాల్గొనాలి

- ఎంఈవో సత్యనారాయణశెట్టి

తిమ్మాజిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి పాఠశాలలో నిర్వహించే పోటీ పరీక్షల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని అన్నారు. తిమ్మాజిపేటలోని జడ్పీహెచ్ పాఠశాలలో శుక్రవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆవం చ, మారేపల్లి, గోరింట, చేగుంట, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉర్దూమీడి యం పాఠశాల తిమ్మాజిపేట జడ్పీహెచ్ ఎస్‌లలో పదవ తరగతి విద్యార్థులకు గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించారు. జీహెచ్‌ఎం తిరుపతిరెడ్డి, శివారెడ్డి, స్నేహలత, గీతిక, కురుమూర్తి, సుచరిత, సాదియాబేగం, సాంసను, శ్రీనివాస్‌రెడ్డి, లావణ్యలు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి : శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని పెద్దకొత్తపల్లి మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్షల్లో శుక్రవారం ఇంగ్లీష్, తెలుగు మీడియం గ్రూప్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ ద్వితీయ సా నాల్లో ముగ్గురు, తెలుగు మీడియంలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఒక్కొ క్కరు చొప్పవన జిల్లా స్థాయికి ఎన్నికైనట్లు ఎంఈవో కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రాము, జీహెచ్‌ఎం జడ్పీహెచ్‌ఎస్ వెన్నచర్ల జీహెచ్‌ఎం రాములు, టీఎంఎఫ్ మండల అధ్యక్షకార్యదర్శులు బి.శివ,ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.



జిల్లా స్థాయి పరీక్షలకు ఎన్నికైన విద్యార్థులు అభినందిస్తున్న పెద్దకొత్తపల్లి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

రైతుల పక్షాన నిలుస్తున్న ప్రభుత్వం

-పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి

తాడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తూ 500రూపాయల బోనస్‌ను అందిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెన్నంటే ఉండి అన్ని విధాలా సహాయ సహకారాలందిస్తుందన్నారు. రుణమాఫీ కాని రైతులకు రానున్న రోజుల్లో మాఫీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందన్నారు. రాబోయే కాలంలో రైతుల వద్ద నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. సింగిల్ విండో కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబానికి పరామర్శ

కల్వకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ శేఖర్‌యాదవ్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు రాంభూపాల్‌రెడ్డి, బండెల రామ చంద్రారెడ్డిలు శుక్రవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పురం శేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకటేశ్‌యాదవ్, నరేష్‌చారి, సురేందర్, బాబీయాదవ్, దామోదర్, మహేష్, అంజి, వంశీకృష్ణ, శ్రీను తదితరులు ఉన్నారు.

మైనార్టీ గురుకులం తనిఖీ

కల్వకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలను మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలోని పరిసరాలను, ఆహార వస్తువులను, విద్యార్థులకు అందుతున్న భోజనాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కమిషనర్ వెంట ఇన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివ తదితరులు ఉన్నారు.

హాస్టల్ తనిఖీ

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలురు వసతి గృహాన్ని స్థానిక మునిసిపల్ కమిషనర్ బి.నరేష్‌బాబు తనిఖీ చేశారు. హాస్టల్‌లో కిచెన్, స్టోర్ రూంతో పాటు హాస్టల్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్న వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట మునిసిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి రామస్వామి, వసతి గృహ సిబ్బంది తదితరులు ఉన్నారు.

'సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి'

కోడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఎమ్మార్సీ భవనం ముందు మధ్యాహ్న విశ్రాంతి సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు సర్వ శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని అప్పటి హనుమకొండ దీక్ష శిబిరంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అప్పట్లో వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చారని అన్నారు. 15 రోజుల్లో మా హామీలు నెరవేర్చకపోతే సమ్మెలోకి వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు బంగారయ్య, నాగేంద్రం, బోజ్యనాయక్, చంద్రశేఖర్, సాయి కుమార్, విజయలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షల్లో గ్రేడింగ్ విధానమే ముద్దు

కోడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్ష్లో గ్రేడింగ్ విధానాన్ని ఎత్తివేసి మార్కుల విధానాన్ని ప్రవేశపెట్టడం విద్యార్థుల మానసిక ఒత్తిడికి గురి చేస్తుందని కావున మార్కుల విధానాన్ని కాకుండా పాత విధంగానే గ్రేడింగ్ విధానం కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు దేవరపాగ నరసింహ, కురుమయ్య, దావీదు మద్దిలేటి, దానమ్మలు అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు.

ప్రతీ ఎకరాకు సాగునీరు

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చంద్రసాగర్‌ను నుంచి ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి నీటిని విడుదల చేశారు. నీటిలో పూలుచల్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రసాగర్ ఆయకట్టు కింద 1200 ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఇప్పుడు మరో 300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని అన్నారు. చంద్రసాగర్ కాలువల మరమ్మల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ బాలస్వామి, ఏఈ రమేష్, ఇరిగేషన్ శాఖ అధికారులు, విజయ డెయిరీ చైర్మన్ నర్సయ్య యాదవ్, నాయకులు మాజీ ఎంపీపీ రామనాథం, మంత్రియా నాయక్, కాశన్న యాదవ్, అభి, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను శంకుస్థాపన

బల్మూరు : ప్రతీ గ్రామీణ ప్రాంతంలో ప్రజల అవసరాలను తెలుసుకుని వాటిని తీర్చడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తుమ్మన్‌పేట గ్రామంలో రూ.8లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.20లక్షలతో చేపట్టనున్న గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకటరెడ్డి, నాయకులు గిరివర్ధన్ గౌడ్, నర్సింగరావు, హాకీయానాయక్, బిచ్చనాయక్, సుధాకర్‌గౌడ్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో రాఘవులు, సీడీపీవో దమయంతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేవీఎన్‌రెడ్డి

వంగూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని మద్దతు ధర కోసం రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో పీఏసీఎస్ రంగాపూర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సన్నాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి, సీఈవో విష్ణుమూర్తి, రాములు యాదవ్, వంశీ, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే నేరాల అదుపు

- కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు

వెల్దండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సహకారంతోనే నేరాలను అదుపు చేయవచ్చునని కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వెల్దండ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలు అడిగితెలుసుకున్నారు. మద్యంసేవించి వాహనాలు నడుపరాదని, వాహనచోదకులు హెల్మెట్‌లు, సీటుబెల్టులు పెట్టుకోవాలని సూచించారు. దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వెంకటేశ్వర్లు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కురుమూర్తి ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

క్రీడా స్ఫూర్తితో రాణించాలి : కల్వకుర్తి సీఐ

కల్వకుర్తి : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించాలని కల్వకుర్తి సీఐ బి.నాగార్జున పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని సీబీఎం కళాశాల ఆవరణలో సీనియర్ మహిళల క్రికెట్ జట్టు ఎంపిక జరిగింది. క్రీడలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, కల్వకుర్తిఎస్ఐ మాధవరెడ్డి, జిల్లా క్రీడాధికారి సీతారాంలతో కలిసి సీఐ నాగార్జునలతో కలిసి ప్రారంభించారు. తాను సైతం క్రీడాకారునిగా ఉంటూ మూడు ఉద్యోగాలు సాధించానని సీఐ పేర్కొన్నారు. అనంతరం జిల్లా జట్టు ఎంపికైంది. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కురుమూర్తి గౌడ్, కబడ్డీ జిల్లా అసోసియేషన్‌ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ దమయంతి, పీడీలు అంజయ్య, పురంచంద్, కోచ్‌గణేష్, ప్రకాశ్, రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేయాలి

- బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి దాస్

కొల్లాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను నిత్యం ప్రభుత్వ అధికారులు తనిఖీలు చేయాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి దాసు కోరారు. శుక్రవారం కొల్లాపూర్‌లో ఆర్డీవో భన్సీలాల్‌కు బీఎస్ఎఫ్ఐ నాయకులు లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళలను అధికారులు తనిఖీ చేయాలని కోరారు. ఫుడ్ పాయిజన్‌తో మరణించిన శైలజ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న ప్రవీణ్ కుటుంబానికి రూ.10 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ఐ కొల్లాపూర్ అధ్యక్షుడు గణేష్ పాల్గొన్నారు.

ఎంఈవో చంద్రుడుకు ఘనంగా వీడ్కోలు

తెలకపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్లపాటు తెలకపల్లి మండల విద్యాధికారిగా పని చేసి ఇటీవల వెల్దండ మండల విద్యాధికారిగా బదిలీపై వెళ్లిన చంద్రుడిని శుక్రవారం తెలకపల్లిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అన్ని ఉపాధ్యాయ సంఘాల సంఘ బాధ్యులు మాట్లాడుతూ చంద్రుడు మండల విద్యాధికారిగా ఎంతో అంకితభావంతో పని చేశారని అన్నారు. మండలంలో విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అనంతరం చంద్రుడు మాట్లాడుతూ తెలకపల్లి మండలంలో సుదీర్ఘ కాలం పని చేయడానికి ఉపాధ్యాయులందరూ సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, చల్మారెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సుఖజీవన్‌రెడ్డి, నరహరి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

- తహసీల్దార్‌కు కేవీపీఎస్ వినతి

కల్వకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన బియ్యం అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ ఇబ్రహీంకు కేవీపీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు మాట్లాడుతూ పాఠశాలలకు నాణ్యమైన బియ్యం అందించడం లేదని దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు స్పం దించి మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లె జగన్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు శేఖర్, కేవీపీఎస్ నాయకులు డేవిడ్ చంద్రయ్య, పురుషోత్తం, రజక సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

'మాలలు సింహగర్జనకు తరలిరావాలి'

అచ్చంపేటటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 1న సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలలు సింహ గర్జనకు డివిజన్ నుంచి పెద్ద ఎత్తున్న తరలిరావాలని మాల ఉద్యోగుల డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. శుక్రవారం పట్టణంలోని పీవీరావు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాల మహానాడు నాయకులు మల్లిఖార్జున్, నారాయణ, అనిల్, రవీందర్, బాలస్వామి పాల్గొన్నారు.

సమయానికి బస్సులు రాక విద్యార్థుల అవస్థ

తెలకపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బస్సులు సమయానికి రాకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని గట్టునెల్లికుదురు, రాయిపాకుల గ్రామాలకు బస్సులు సకాలంలో రాకపోవడం వల్ల శుక్రవారం సాయంకాలం గౌరెడ్డిపల్లి బస్టాండ్‌లో విద్యార్థులు బస్సు కోసం ఎదురు చూస్తూ నిలబడ్డారు. ఈ మధ్య కాలంలో సాయంకాలం ఐదున్నరకే చీకటి పడుతుండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. సకాలంలో బస్సు నడపాలని విద్యార్థులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు